క్లుప్తంగా

ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దక్షిణాముఖ ఆంజనేయస్వామికి శనివారం అర్చకులు వంశీకృష్ణ విశేషనాగవల్లీ దళార్చన నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

మల్లేశ్వరునికి అంకురారోపణ పూజలు



మంగళగిరి: నగరంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు మల్లేశ్వరునికి అంకురారోపణ, దేవతాహ్వాన పూజలు నిర్వహించారు. సాయంత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ధ్వజారోహణ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లను ఆయా కూడళ్లలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా పూజాది కార్యక్రమాలకు కైంకర్యపరులుగా నాగ వెంకట పవన్‌కుమార్, లావణ్య దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ఈఓ ఎ.రామకోటిరెడ్డి పూజాది కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



చింతలపూడి(తాడేపల్లి రూరల్): దుగ్గిరాల మండలం చింతలపూడి వద్ద చోసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామంలో రోడ్డుపక్కనే నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. క్షతగాత్రుడిని 108లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. వ్యక్తి బ్లూకలర్ షర్ట్, లైట్‌కలర్ సన్నిగీతలు, గళ్లలుంగీ ధరించి ఉన్నాడు. ఎవరైనా గుర్తిస్తే దుగ్గిరాల పోలీసులను సంప్రదించాలని కోరారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని ఎన్నారై వైద్యశాలకు చికిత్స నిమిత్తం వచ్చిన ఓ వివాహిత మహిళ అదృశ్యమైంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. విజయవాడ నగరంలోని వాంబే కాలనీకి చెందిన బత్తుల సునీతదేవి(32) మామయ్య చికిత్స చేయించేందుకు కుటుంబ సభ్యులతో కలసి ఈనెల 9వ తేదీన వైద్యశాలకు వచ్చారు. అయితే ఆమెతో వచ్చిన కుటుంబ సభ్యులందరూ ఆసుపత్రి పై అంతస్తులోకి వెళ్లగా మానసిక స్థితి సరిగా లేని సునీత దేవి తనను అందరూ వదిలి వెళ్లిపోయారనే భయంతో ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు సునీత దేవి కోసం గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త బి.నాగరాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

బీపీ మండల్ విగ్రహ ఏర్పాటు అభినందనీయం

నెహ్రూనగర్: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ విగ్రహాన్ని ఆదివారం నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగిన బీసీ మేధావుల సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ మండల్ ఆశయాలకు అనుగుణంగా బీసీలంతా నడుచుకోవాలని సూచించారు. రిటైర్డ్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయడంలో చూపినంత చొరవ ఓబీసీల రిజర్వేషన్ల విషయంలో చూపించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీసీల కులాల వారీగా కులగణన చేపట్టాలని పలువురు బీసీ మేధావులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీపీ మండల్ మనవడు సూరజ్ మండల్, డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ నారాయణ, ప్రొఫెసర్ పాత్రో, ప్రొఫెసర్ సందీప్‌యాదవ్, ప్రొఫెసర్ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి ఇరిగేషన్ స్థలం!

- చోద్యం చూస్తున్న అధికారులు
- బోర్డులు పెట్టినా పట్టించుకోని వైనం



కుంచనపల్లి బ్రిడ్జి కింద ఇరిగేషన్ భూమిలో ఉన్న రేకుల షెడ్డు అమ్మబడును అని బోర్డు పెట్టిన దృశ్యం

తాడేపల్లి రూరల్: ఇరిగేషన్ భూములను అంగట్లో సరుకులు అమ్మిన విధంగా కొంతమంది ఆక్రమణదారులు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. 2019 అక్టోబర్ 10న సాక్షిలో ఆక్రమణలో బకింగ్ హామ్ కెనాల్, కొత్తగా వెలుస్తున్న వ్యాపార సముదాలు అంటూ కథనం వెలువడడంతో రెండుమూడు రోజులు ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. ఆ సమయంలో బకింగ్‌హామ్ కెనాల్‌ను ఆక్రమించుకుని షెడ్లు నిర్మాణాన్ని తాత్కాలికంగా తొలగించారు. అప్పట్లో ఉన్న తాడేపల్లి ప్రాంతంలోని ఇరిగేషన్ అధికారులు ఆక్రమణదారుల దగ్గర ఒక్కొక్క షాపునకు లక్ష రూపాయలు వసూలు చేసినట్లు విమర్శలు వచ్చాయి. ఇరిగేషన్ అధికారులు ఏ షాపులయితే తొలగించారో అక్కడే మరలా కాలక్రమేణా పునర్నిర్మాణం చేశారు. వాటిలో ఇప్పటికే కొన్ని స్థలాలను ఆక్రమణదారులు గుట్టు చప్పుడు కాకుండా అమ్ముకున్నారు. తాజాగా ఓ వ్యక్తి ఒక అడుగు ముందుకు వేసి కుంచనపల్లి బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జి కింద ఈ షాపు అమ్మబడును అంటూ 8555889238 ఫోన్ నంబర్ పెట్టి ఏకంగా బోర్డు కూడా పెట్టేశారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు మేల్కొని బకింగ్‌హామ్ కెనాల్ కరకట్టపై ఆక్రమణలు తొలగించి గ్రీనరీ ఏర్పాటు చేయాలని పలువురు కోరుకుంటున్నారు.



క్రాంతి శర్మ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాయిమాధవ్ బుర్రా తదితరులు

వైభవంగా అరసం మహాసభలు

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 80వ వార్షికోత్సవాలు, 19వ రాష్ట్ర మహాసభలు ఆంధ్రాప్యారిస్ తెనాలిలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండురోజులపాటు మహాసభలు జరిగే స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం ప్రాంగణానికి తెనాలికి చెందిన అభ్యుదయ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ పేరుతో, సాహిత్య సభావేదికకు నేతి పరమేశ్వరశర్మ పేరుతో నామకరణం చేశారు. సంఘం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.సంజీవమ్మ పతాకావిష్కరణతో మహాసభలు ప్రారంభించారు. సుప్రసిద్ధ కవి ఎస్.వి.రామశాస్త్రి చిత్రించిన రచయితల ఛాయాచిత్రాలు, పుస్తక ప్రదర్శనను ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ఆవిష్కరించారు. 'నూరేళ్ల తెనాలి రంగస్థలి' పుస్తక రచయిత నేతి పరమేశ్వరశర్మపై రూపొందించిన 'క్రాంతి శర్మ' పుస్తకాన్ని ఆహ్వానసంఘం అధ్యక్షుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ఆవిష్కరించారు.సాయంత్రం 5.15 గంటలకు రచయితల పాదయాత్ర కళాక్షేత్రమ్ నుంచి రణరంగచౌక్ వరకు కొనసాగింది. అక్కడ అమరవీరుల స్తూపాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

– తెనాలి



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న డాక్టర్ కృపాచారి



సాయంత్రం రణరంగ చౌక్‌లో అమరవీరుల స్తూపాల వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న అరసం నేతలు

రాజీమార్గమే రాజమార్గం

సీనియర్ సివిల్ జడ్జి శేషయ్య



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషయ్య

మంగళగిరి: రాజీమార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి డి.శేషయ్య అన్నారు. మంగళగిరి కోర్టుల ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ వలన కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని వ్యాఖ్యానించారు. లోక్ అదాలత్‌లో రాజీపడ్డ ఇరువురూ విజేతలేనని చెప్పారు.దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జరుగుతున్న లోక్ అదాలత్‌లలో రాజీపడదగ్గ కేసులకు సంబంధించి కక్షిదారులు తమ కేసులు రాజీ చేసుకోవచ్చునన్నారు. న్యాయవాదులు కూడా లోక్ అదాలత్‌లకు చేయూతనందిస్తూ సమన్వయం చేస్తున్నారని చెప్పారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారా బ్యాంకుకు సంబంధించి మొండి బకాయిలు, వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌తో కాలయాపన లేకుండా పరిష్కరించబడుతున్నాయని చెప్పారు. దీని వలన కక్షిదారులకు ఎంతో ఉపయోగమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీపత్యూష, బ్యాంకు అధికారులు లలితా ప్రసాద్, మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డక బ్రహ్మానందరావు, తోట నరసింహారావు, ఉపాధ్యక్షుడు లెనిన్ బాబు, ఏజీపీ కె చంద్రశేఖర్, అడిషనల్ పీపీ రేటూరి కిషోర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.నాగమణి పాల్గొన్నారు.

544 కేసుల పరిష్కారం...

మంగళగిరి కోర్టుల పరిధిలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం 544 కేసులు పరిష్కారమయ్యాయి. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీసీలు 125, చెక్ బౌన్స్ కేసులు 12, మనోవర్తి కేసులు 2, గృహ హింస కేసులు 3, ఎస్టీసీలు 376 మొత్తం 544 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్‌లు 4, సీఎల్‌సీలు 20, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఓఎస్ 1, సీసీ 1 పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో 67,25,615 నగదు జమ చెల్లింపులు జరిగాయి.

మృతురాలి కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): మండల పరిధిలోని పేరుకలపూడికి చెందిన గూడూరి హేమ వెంకట కృష్ణ పూర్ణిమ మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్కే అందించిన రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందించారు. అందించిన వారిలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, గ్రామ సర్పంచి గంపల గంగాధర్, ఉప సర్పంచి తాడిబోయిన గంగాధర్, నాయకులు నూతలపాటి కేశవరావు, డివిఆర్, నల్లగొర్ల నాగేశ్వరరావు, ఆళ్ల మహేష్, సుధీర్ పాల్గొన్నారు.

పెదకొండూరుకు చెందిన..

దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు గ్రామంలో ఇటీవల కృష్ణానది ఏరులో ప్రమాదవశాత్తు పడి మరణించిన కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. శనివారం ఆ ఆర్థిక సహాయాన్ని ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొండూరు సుమన్, గ్రామ సర్పంచి సౌజన్య, నాయకులు డీవీఆర్, కొండూరు సుబ్బారావు, శేషయ్య, నాని, సునీల్ పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



ఒకనాటి విద్యార్థులకు మరో జ్ఞాపకమైన కలయిక

- అంతా 75 ఏళ్లు పైబడిన వారే
- 1965–68 బ్యాచ్ డిగ్రీ విద్యార్థుల సందడి

తెనాలి: వాళ్లంతా 75 ఏళ్లు పైబడినవారే...ఉద్యోగాలు, వ్యాపారాల్నుంచి రిటైరైనవారు, జవసత్వాలు ఉడిగిపోకుండా నవ యువకులకు ఏమాత్రం తీసిపోకుండా ఏదొక వ్యాపకంలో కొనసాగుతున్న వారే. కాలేజీ రోజుల్లోని నేస్తాలను కలుసుకునేందుకు ఎక్కడెక్కణ్ణుంచో రెక్కలు కట్టుకుని వాలారు. కుటుంబ వివరాల నుంచి, చేస్తున్న వ్యాపకాలను పరస్పరం పంచుకున్నారు. ఆత్మీయ విందును ఆరగించి మళ్లీ కలుద్దామని వీడ్కోలు తీసుకున్నారు. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీలో 1965–68 సంవత్సరాల్లో బీఎస్సీ ఎంపీసీ చదివిన విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. కాలేజీ ప్రిన్సిపాల్‌గా చేసి, ప్రస్తుతం అరవింద విద్యాకేంద్రం ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ పరుచూరి రాఘవేంద్రరావు చొరవతో శనివారం అరవింద విద్యాకేంద్రంలోనే కలుసుకున్నారు. అప్పట్లో మొత్తం 80 మంది విద్యార్థులు కాగా, వయోభారంతో కాలం చేసినవారు, కరోనా కాటేసినవారు, ఇక్కడికి రాలేనివారిని మినహాయిస్తే దాదాపు 23 మంది వరకు ఉన్నారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. చేసిన ఉద్యోగం, వ్యాపారాలను గురించి చెప్పుకుని, విశ్రాంత జీవితంలోని కార్యకలాపాలను, కుటుంబ వివరాలను పంచుకున్నారు. వాస్తవానికి రాఘవేంద్రరావు ఆసక్తి ఫలితంగా 2015లోనే తొలిసారిగా వీరంతా కలుసుకోగలిగారు. అప్పటికది వారు డిగ్రీ పూర్తిచేసిన స్వర్ణోత్సవ సంవత్సరం. అప్పట్లో 35 మందికిపైగా హాజరయ్యారు. మరోసారి కలుసుకోవాలన్న భావనతో ఇప్పుడు 23 మంది వరకు రాగలిగారు. వీరిలో హైదరాబాద్‌లో ఉంటున్న బీఎస్ సింగ్ ఒకరు. కేంద్ర సర్వీసు నుంచి రిటైరైన ఆయన ఇప్పుడు సంఘసేవలో ఉన్నారు. మరొకరు కేసీహెచ్ నారాయణ. హైదరాబాద్‌లోని మాతాపితరుల సేవా కేంద్రం, అమ్మానాన్న అనాథాశ్రమం, బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్, వివేకానంద పబ్లిక్ స్కూలు బోర్డు సభ్యుల్లో ఒకరుగా అనాథలు, మానసిక వికలాంగులైన పెద్దలకు ఆశ్రమం, అనాథ పిల్లలకు చదువులకు సాయపడుతున్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడైన టీవీఎస్ శాస్త్రి ఇప్పుడు కళారంగ సేవ చేస్తున్నారు. ఇలా ఒకరి వివరాలు ఒకరు తెలుసుకుని మురిసిపోయారు. జ్ఞాపకాల మూటతో తిరుగుపయనమయ్యారు.

జంప్ రోప్ పోటీల్లో తెనాలి విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ స్రవంతిరాయ్

తెనాలి అర్బన్: జాతీయస్థాయి జంప్ రోప్ పోటీల్లో తెనాలికి చెందిన జి.శశాంక్‌కు బంగారు పతకం, యశ్వంత్, గీతారామ్, మోక్షిత్, కార్తీక్‌లకు రజత పతకాలు, యుక్తశ్రీకి కాంస్య పతకాలు లభించినట్లు మైటీ స్పోర్ట్స్ అకాడమి జనరల్ సెక్రటరీ జి.అనిల్‌కుమార్ తెలిపారు. పోటీల్ని ఈ నెల 3వ తేదీ నుంచి ఐదు వరకు షిర్డీలో నిర్వహించినట్లు చెప్పారు. వీరందరూ త్వరలో బూటాన్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. తన కార్యాలయంలో శనివారం తెనాలి డీఎస్పీ డాక్టర్ స్రవంతిరాయ్ విద్యార్థుల్ని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా జంప్ రోప్ అసోసియేషన్ కార్యదర్శి జయరామ్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రాతూరులో ఇద్దరు చిరు వ్యాపారులకు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో శనివారం తోపుడు బండ్లను అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ మంచికలపూడి లక్ష్మణరావు, కూసుమంచి వరహాలశెట్టి తోపుడు బండ్లను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, సభ్యులు చంద్ర ఓబులా రెడ్డి, పరుచూరి కిరణ్, సుకుమార్ రెడ్డి, మన్నే సత్యనారాయణ, రావూరి రమేష్ బాబు, శంకరశెట్టి రమేష్, బొంతు అప్పిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, రాచెర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా బాబాకు అభిషేకం

తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరులోని శ్రీరామసాయి జ్ఞాన మందిరంలో 15వ వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం శ్రీ అగస్త్యేశ్వర భజన సమాజం విష్ణు సహస్రనామ పారాయణం చేసింది. అనంతరం బాబాకు 108 కలశాలతో అర్చకులు, మహిళలు అభిషేకం నిర్వహించారు. అర్చకులు కారంశెట్టి శ్రీనివాసరావు విశేష పూజలు జరిపారు. కార్యక్రమంలో రామసాయి ట్రస్ట్ అధ్యక్షుడు సంకా సతీష్, ఉపాధ్యక్షుడు మలిశెట్టి శ్రీనివాస్, కొల్లిపర సీతారామ కోటేశ్వరరావు, పోకల శివరామకృష్ణ, సంకా సీతారామయ్య, రవికుమార్, అమరేంద్రప్రసాద్, అకరంశెట్టి నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలు ప్రారంభం

తెనాలి అర్బన్: అమరావతి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో శనివారం అబ్దుల్ సత్తార్ ఖాన్ మెమోరియల్ 20–20 అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ రియాజ్‌ఖాన్ ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ తమ మామ అబ్దుల్ సత్తార్ ఖాన్ పేరిట క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో వివిధ జిల్లాల నుంచి జట్లు పాల్గొంటాయని చెప్పారు. టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న అమరావతి క్రికెట్ టీమ్ సభ్యుల్ని అభినందించారు.

తాడికొండ సోషల్ మీడియా కన్వీనర్లు నియామకం

తాడికొండ: వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్లను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. తాడికొండ మండల కన్వీనర్‌గా కొలవేణు నవీన్ కుమార్, కో కన్వీనర్లుగా షేక్ ఆసిఫ్, పరుచూరి సాయి కిరణ్, వంగా రాహుల్ రెడ్డి, తుళ్లూరు మండల కన్వీనర్‌గా ఐనవోలు సుధీర్, కో కన్వీనర్‌లుగా చెన్నకేశవ మాతంగి గద్దర్, సలార్ ఖాన్, తోకల కోటేశ్వరరావు, కారంకి శేషగిరిరావు, మేడికొండూరు మండల కన్వీనర్‌గా సొపాటి రాజేష్, కో కన్వీనర్‌లుగా మర్రి వినోద్, ఉడతా ప్రభాకర్, షేక్ జానీ బాషా, రహమాన్ నియమితులయ్యారు.

సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా బోళ్ల

ఫిరంగిపురం: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా వేములూరిపాడు గ్రామానికి చెందిన బోళ్ల వెంకటశివనాగరాజు శనివారం నియమితులయ్యారు. కో కన్వీనర్లుగా రేపూడి రవి, యనమాల గోపి, తిరుపతిరావు, వి.సాంబశివరావులను నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, పార్టీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

దీన్‌దయాళ్‌కు నివాళి

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని శనివారం దుగ్గిరాల లోని వాసవి కళ్యాణ మండపంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు చుండూరు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ నుంచే హజ్ యాత్ర హర్షణీయం

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): ముస్లింలు పవిత్రంగా భావించే హజ్ యాత్రకు విజయవాడ నుంచే వెళ్లేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టడం హర్షణీయమని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని పేర్కొన్నారు. శనివారం దుగ్గిరాల గ్రామంలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్ర షెడ్యూల్ విడుదల చేశారని, మార్చి 10 వరకు అవకాశం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ జానీ సాహెబ్, షేక్ రషీద్ సాహెబ్, షేక్ హసేన్, షేక్ ఖాజావలి, సయ్యద్ జానీ పాల్గొన్నారు.

ఆటో చోరీ

పట్నంబజారు: ఇంటి ముందు నిలిపిన ఆటోను దుండగులు చోరీకి పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. సాయిబాబా కాలనీలో నివాసం ఉండే వెంకటేశ్వరరావు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దుండగులు ఇంటి ముందు నిలిపి ఉన్న ఆటోను అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మెకానిజమ్, నాణ్యతా ప్రామాణిక సదస్సు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాసంస్థల్లో నాణ్యతను నిర్ధారించడం కోసం మెకానిజమ్, నాణ్యత ప్రామాణిక సదస్సు శనివారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ప్రొ వైస్ చాన్సలర్ కె.జగన్నాథరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన సదస్సుకు 11 దేశాలకు చెందిన పలువురు విద్యావేత్తలు వర్చ్యువల్ విధానంలో పాల్గొన్నారని తెలిపారు. ఉన్నత విద్యా ప్రమాణాలకు కేఎల్‌యూ చిరునామాగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో బహ్రెయిన్, మలేషియా, నైజీరియా, ఒమన్, యుకెవంటి దేశాలకు చెందిన విద్యావేత్తలు పాల్గొని ప్రసంగించారు. భారత దేశం నుండి 600 మంది అధ్యాపకులు ఈ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఐక్యూసి సలహాదారు డాక్టర్ కె.కోటేశ్వరరావు, క్వాలిటీ డీన్ డాక్టర్ కె.రామకృష్ణ, ఐక్యూ ఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

బాలిక మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రుకు చెందిన బాలికను మోసం చేసి మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పరిచారు. ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బాలికను కలపాల అనిల్‌కుమార్ ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పి పెళ్లి విషయం ఎత్తేసరికి ఊరు వదిలి వెళ్లిపోయాడు. వీరి ప్రేమ విషయం రెండు కుటుంబాల వారికి తెలిసిన పెళ్లికి కూడా అంగీకరించారు. అయితే అనిల్‌కుమార్ నిరాకరించి బాలికను పెళ్లి చేసుకోనని తేల్చి చెప్పడంతో బాలిక మనస్తాపం చెంది ఈనెల 7వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. ఘటనపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అనిల్‌కుమార్‌ను రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.